క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కవిత

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రత్యేక నిధులతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను శుక్రవారం ఎంపీపీ కలిగేటి కవిత ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నె దర్శన్‌రావు, ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా, కార్యదర్శి రాజు, నాయకులు కలిగేటి లక్ష్మణ్, మధుకర్, నెల్లి కొంరయ్య, సురేందర్‌రెడ్డి, రాజేశం, కొంరయ్య పలువురు పాల్గొన్నారు.

బీమా పత్రాలు అందజేత



బీమా పత్రం అందిస్తున్న పోస్టల్ అధికారి

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో శుక్రవారం ఐక్యత యూత్ ఆధ్వర్యంలో పలువురు పోస్టల్ బీమా పాలసీ తీసుకున్నారు. ఈ సందర్భంగా పోస్టల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పోస్టల్ బీమా పాలసీతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఐక్యత యూత్ క్లబ్ అధ్యక్షుడు కాడె కనకయ్య, సబ్ పోస్టల్ అధికారి చంద్రమోహన్, బీపీఎం శంకరయ్య పలువురు పాల్గొన్నారు.

దళితబంధు పథకం వినియోగించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు దళితబంధు పథకం కింద మంజూరైన యూనిట్లను శుక్రవారం ఎంపీపీ ఇరుమల్ల రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడిగుటి శారద ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ పంజాల సదానందం, సింగిల్ విండో వైస్ చైర్మన్ రజిత, రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఉపఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరినవారు. తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసీడీ బిల్లులు రద్దు చేయాలి

చొప్పదండి: ఏసీడీ చార్జీలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న అదనపు భారాన్ని వెంటనే రద్దు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ... గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి అదనపు వినియోగపు డిపాజిట్‌ల పేరుతో బిల్లులు వసూలు చేయడం సరికాదన్నారు. సంక్షేమం, అభివృద్ధి పేరుతోఇప్పటికే ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి షాక్ ఇచ్చారని, ఇప్పుడు ఏసీడీ పేరుతో చార్జీలు రుద్దడం సబబు కాదన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



శంకరపట్నం: ఆయుష్మాన్ భారత్ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. కామన్ సర్వీస్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం పథకం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రీధర్, అభిలాశ్, తదితరులు ఉన్నారు.

అదృశ్యం కేసు

జమ్మికుంట: భర్త ఆచూకీ కోసం భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు శుక్రవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన మారపల్లి సమ్మయ్య మూడు రోజుల క్రితం కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్లను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

పాలనలో ఆదర్శంగా..

- నుస్తులాపూర్ గ్రామం
- రూ. 40 లక్షలతో నూతన పంచాయతీ భవనం నిర్మాణం
- 22న ప్రారంభించనున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- హాజరుకానున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- పాత జీపీ భవనంలో హెల్త్ సెంటర్ నిర్వహణ



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నుస్తులాపూర్ నూతన గ్రామ పంచాయతీ భవనం



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, తదితరులు

తిమ్మాపూర్: మండలంలోనే కాదు నియోజకవర్గంలోని గ్రామాలకు నుస్తులాపూర్ పంచాయతీ పాలనలో ఆదర్శంగా నిలుస్తోంది. సర్పంచ్ రావుల రమేశ్ ప్రత్యేక చొరవతోపాటు సొంతంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆడబిడ్డ పుడితే రూ.5 వేల డిపాజిట్, అంత్యక్రియలకు ఆర్థికసాయం, ఉచిత దహన సంస్కారాలు, వైకుంఠరథం, మహిళా సంఘాలకు సహకారం వంటివి చేస్తున్నారు. తాజాగా మోడల్ పంచాయతీ భవనం నిర్మించారు. ఈ నెల 22న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

- నుస్తులాపూర్ గ్రామపంచాయతీ భవనాన్ని రూ. 40 లక్షలతో నిర్మించారు.
- సర్పంచ్ ప్రతిరోజు పనులు పర్యవేక్షించారు.
- భవనంలో సర్పంచ్, పాలకవర్గం మీటింగ్, వెయిటింగ్ హాళ్లు, కార్యదర్శి, ఈ పంచాయతీ అధికారికి వేర్వేరుగా గదులు ఏర్పాటు చేశారు.
- రాజీవ్ రహదారికి పక్కనే గ్రామ పంచాయతీ భవనం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది.
- సుమారు ఇరవై గుంటల స్థలంలో నిర్మించిన భవనాన్ని ప్రారంభించిన తర్వాత చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడతామని సర్పంచ్ తెలిపారు.
- నూతన గ్రామ పంచాయతీ ప్రారంభంకాగానే పాత గ్రామ పంచాయతీలో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తామని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.
- మూడు బెడ్లు ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యం అందిస్తామని, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో..



మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకారంతో మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతాం. గ్రామ అభివృద్ధికి నిధులు లేవ నకుండా ఎమ్మెల్యే నూతన గ్రామ పంచాయతీ భవనానికి రూ.40 లక్షలు మంజూరు చేయించారు. విశాలమైన స్థలంలో భవనం నిర్మించాం. మండలంలో నుస్తులాపూర్ వ్యాపారులకు కమర్షియల్ విలేజ్‌గా పేరొందింది.

– రావుల రమేశ్, సర్పంచ్

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరిక



తిమ్మాపూర్: లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్/మానకొండూర్‌రూరల్: రాష్ట్రంలో అభివృద్ధినిచూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పచ్చునూర్‌లో శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేశారు. ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు అడప శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువత సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, సమన్వయంతో పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు. ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో జరుగుతుందని, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలోకి చేరుతున్నారని వివరించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. సుడాచైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, రామంచ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పదాల శంకరయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: తొలిపొద్దు కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అల్గునూర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్పొరేటర్ శారద, పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్, డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్‌రెడ్డి, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, పాశం అశోక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్, రవీందర్ పాల్గొన్నారు.

ఇంటి నంబర్ల కేటాయింపుపై కొనసాగుతున్న విచారణ

ఇద్దరు ఉద్యోగులకు మెమోలు

సాక్షి ఎఫెక్ట్

చొప్పదండి: మున్సిపాలిటీలోని ఆరోవార్డులో ఇల్లు లేకున్నా ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్ కేటాయించడంపై ఈ నెల 13న 'సాక్షి'లో 'ఇదెక్కడి చోద్యం' కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు ఇద్దరు ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఎటువంటి పత్రాలు లేకుండానే ఇంటి నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై ఉద్యోగులకు ఏమైనా సంబంధం ఉందా అంటూ ప్రశ్నించారు. అక్రమాలకు తెరతీసిన వారి వివరాలు బయటకు వస్తే చర్యలు తీసుకొనే అవకాశం ఉండటంతో, గతంలో పనిచేసి బదిలీపై వెళ్లినవారి పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణం లేకుండా ఆరోవార్డులో జరిగిన బాగోతంతో పాటు మున్సిపాలిటీలో ఇంకా ఏమైనా ఇటువంటి అక్రమాలు జరిగాయా అనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. ఇంటి నంబరు పొందడంపై యజమానికి మరోమారు నోటీసులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

'కంటి వెలుగు'పై నిర్లక్ష్యం వహించొద్దు



శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో



చిగురుమామిడిలో వృద్ధుడికి కంటి పరీక్షలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం జెడ్పీ సీఈవో ప్రియాంక కర్ణన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కంటి పరీక్షలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అర్హులు కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిగురుమామిడి: చిగురుమామిడి, చిన్నముల్కనూర్ గ్రామాల్లో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 293 మందికి పరీక్షలు చేశామని చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్ తెలిపారు. అనంతరం కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. మెడికల్ ఆఫీసర్లు నిర్మల, ప్రత్యూష, వైద్య సిబ్బంది మధుమిలత, శ్రీనివాస్ సూపర్‌వైజర్లు పద్మ, చంద్రకళ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామ పంచాయితీలకు మంజూరైన నూతన పంచాయతీ భవన నిర్మాణ పనులు, ఉపాధిహామీ పథకంలో మంజూరైన సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు



మొక్కలు నాటుతున్న ఉద్యానశాఖ అధికారి ఐలయ్య, రైతులు

హుజూరాబాద్‌రూరల్: ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభం పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి ఐలయ్య అన్నారు. శుక్రవారం ఇప్పలనర్సింగాపూర్ గ్రామంలోని గూడరి రాజిరెడ్డి, గూడురు శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రభుత్వం తరుపున సబ్సిడీ, ఏటా ఎకరానికి నిర్వహణ ఖర్చుల కింద రూ.4,200 నగదు నాలుగేళ్ల వరకు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. నాలుగేళ్ల నుంచి ముప్పై ఏళ్ల వరకు పంట దిగుబడి వస్తుందని, అంతర పంటలు సాగుచేసుకోవచ్చని తెలిపారు. సంవత్సరానికి ఎకరాకు పది టన్నుల దిగుబడి, సుమారు లక్ష రూపాయల ఆదాయం వస్తుందని, బిందు సేద్యానికి సబ్సిడీ ఉందన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలంటే ఆయిల్ పామ్ సాగు ఉత్తమమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ గాజర వేణు, జీకే సమన్వయ సమితి అధ్యక్షులు గూడురు స్వామిరెడ్డి, గూడురు మల్లారెడ్డి, ఎడ్ల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర: మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని గంగాధర మైనారిటీ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ వారుణి సూచించారు. ఐదో తరగతిలో 80, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్లకు, ఇంటర్మీడియట్‌లో సీఈసీ, ఎంఈసీల్లో 40 సీట్లకు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 75 శాతం మైనారిటీలకు, 25 శాతం నాన్ మైనారిటీలకు అవకాశం ఉందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రత్యూష

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వానరాశి ప్రత్యూష రాష్ట్ర స్థాయి సాంఘికశాస్త్రం పోటీల్లో ప్రతిభ కనబరిచింది. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో పదో స్థానంలో నిలిచిందని సాంఘిక శాస్త్రం ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి అవదూత శ్రీనివాస్ తెలిపారు. కాగా ప్రత్యూషను హెచ్ఎం హేనాహేరియట్, ఉపాధ్యాయులు అభినందించారు.

బస్టాప్ ఏర్పాటు చేయాలని వినతి

సైదాపూర్: కరీంనగర్–వరంగల్ హైవేపై మొలంగూర్ క్రాస్ వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే విధంగా బస్టాప్ ఏర్పాటు చేయాలని శుక్రవారం హుజూరాబాద్ కోర్టు జడ్జి ఆధ్వర్యంలో కరీంనగర్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. వీణవంక, శంకరపట్నం, సైదాపూర్ మండలాల గ్రామాలకు మొలంగూర్ క్రాస్ రోడ్డు సెంటర్‌గా ఉంటుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. నేడు కోర్టు ఆవరణలో విచారణకు మూడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని సామాజిక కార్యకర్త గాదపాక కుమార్‌రాజా కోరారు.

కార్యవర్గం, నియామకం

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా కుమారస్వామి



అధ్యక్షుడిని సన్మానిస్తున్న కళాకారులు

గంగాధర: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన కడారి కుమారస్వామి జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఒగ్గు బీర్ల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కుమారస్వామిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఒగ్గరి శేఖర్, ఈర్ల మైపాల్, బైరి శ్రీనివాస్, బోడపట్ల ఒదెలు, పుల్ల కనుకయ్య, ఈర్ల కనుకయ్య, సంతోష్, రాజు, కొమురయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



గన్నేరువరం: అధ్యక్షుడు మాతంగి అనిల్, సభ్యులను సన్మానిస్తున్న యువకులు

గన్నేరువరం: గన్నేరువరం వినాయక యూత్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాతంగి అనిల్, ప్రధాన కార్యదర్శిగా కొలపురి అంజనేయులు, ఉపాధ్యక్షులుగా వెదిరే తిరుపతి, కొలపురి నగేష్, కవ్వంపల్లి రవి, కోశాధికారులుగా మంకాలి నాగరాజు, వెదిరే మహేష్, సలహాదారులుగా వెదిరే విజేందర్, వడ్లకొండ దిలీఫ్, చంద్రమౌళి, ఐలయ్య, శ్రీకాంత్, కండె ప్రశాంత్, సంగెం నాగార్జున, రేపాక రాజు, అనంద్, రాజులు నియామకమయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు, సభ్యులను యువకులు సన్మానించారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా సతీశ్

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామ ఉపసర్పంచ్ తోట సతీశ్‌ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉమ్మడి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు గుర్రాల మల్లేశం నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. పదవికి తగిన న్యాయం చేస్తానని, ముదిరాజ్‌ల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్, కరీంనగర్ జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు పోలు లక్ష్మణ్, పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల కమిటీ

శంకరపట్నం: బీజేపీ శంకరపట్నం మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నామని మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ప్రకటనలో తెలిపారు. మండల ఉపాధ్యక్షులుగా జానపట్ల రాజిరెడ్డి, సూదగోని శ్రీనివాస్, కాంతాల రాజిరెడ్డి, వీరార్జున్, పిన్‌రెడ్డి సంపత్‌రెడ్డి, ప్రధానకార్యదర్శులు గా ఎల్కపల్లి సంపత్, దాసారపు నరేందర్, కార్యదర్శులుగా మీస భీరయ్య, సదానందం, అంతం లతరాజిరెడ్డి, దాసరి సంపత్, దేవునూరి కుమారస్వామి,వడ్ల కొండ రాజేందర్, కోశాధికారిగా చింతిరెడ్డి మల్లారెడ్డి ఎన్నికయ్యారు. అనుబంధ సంఘాలు కిసాన్స్ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షులుగా జగ్గారెడ్డి, శ్రీనివాస్, సాగర్, సారయ్య, వెంకటలక్ష్మి, జీమ్, బీజేవైఎం అధ్యక్షుడిగా నరేశ్, సోషల్‌మీడియా కన్వీనర్‌గా శ్రీకాంత్ నియామకమయ్యారు.



చిగురుమామిడి: సతీశ్‌కు నియామక ఉత్తర్వులు అందిస్తున్న గుర్రాల మల్లేశం

న్యాయవాదులకు ఆటల పోటీలు



చెస్ ఆడుతున్న న్యాయమూర్తి శ్రీవాణి

కరీంనగర్‌క్రైం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో న్యాయవాదులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. న్యాయవాది స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి వడ్లూరి కృష్ణ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్, వాలీబాల్, ప్లేయింగ్ కార్డ్స్,చెస్, పాటలు, కవితల పోటీల్లో న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి తెలిపారు. ఒక్కో గేమ్‌కు ఒక న్యాయవాదిని ఇన్‌చార్జిగా నియమించి నిర్వహిస్తున్న పోటీల్లో గవర్నమెంట్ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొంటున్నారని అన్నారు. శుక్రవారం వి.రఘురామన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శ్రీవాణి హాజరై ప్రారంభించి మహిళా న్యాయవాదులతో పోటీపడ్డారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజు జిల్లా జడ్జి బి.ప్రతిమ చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు తెలిపారు.

ఆత్మవిశ్వాసానికి జూడో క్రీడ దోహదం

కరీంనగర్‌స్పోర్ట్స్: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా సెంటర్‌లతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కబడ్డీ కోచ్ కె శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఖేలో ఇండియా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ జూడో అకాడమిని పరిశీలించి మాట్లాడారు. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి జూడో క్రీడ దోహదపడుతుందన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జూడో సెంటర్ ఏర్పాటైందని ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన స్కిల్స్, టెక్నిక్స్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖా అధికారి కీర్తి రాజవీరు, జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ప్రాంతీయ క్రీడా పాఠశాల హెడ్‌మాస్టర్ లీలాప్రసాద్, జూడో కోచ్ సందమల్ల ప్రియాంక, ఎలగందుల శ్రీనివాస్, క్రీడా పాఠశాల కోచ్‌లు దేశెట్టి పవన్, సాయిరాం యాదవ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు విరాళం అందజేశారని ఆలయ అభివృద్ధి కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల రాజేందర్ శుక్రవారం తెలిపారు. పట్టణానికి ముక్క జయంతి జితేందర్ రూ.15,116, పోరెడ్డి రమాదేవి కోమల్‌రెడ్డి రూ.10,116, కొక్కుల జ్యోతిరాణి సత్యానారాయణ రూ.10,116, పురం సుకన్య వైకుంఠం రూ.10,116,చిదురాల జ్యోతి భాస్కర్, రూ.5,116, దోమకుంట్ల అనిత రమేష్ రూ.5,116, సత్యవెంకట బహుళూర్ రూ.5,116 ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, దాతలకు రశీదు అందజేశారు. అనంతరం స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.